క్లుప్తంగా

నేడు ప్రజా వేదిక

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణకుమార్ తెలిపారు. గత కొద్దిరోజులుగా మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో భాగంగా సిద్ధం చేసిన నివేదికను బహిరంగంగా చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మిగులు భూములు స్వాధీనం చేసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సోమందేపల్లి: మండలంలోని నక్కలగుట్ట కాలనీలో 2009లో ఇంటి స్థలాల కోసం సేకరించిన భూములు ఆక్రమణకు గురయ్యాయని సీపీఎం నాయకులు తహసీల్దార్ అంజనాదేవికి వినతిపత్రం అందజేశారు. మిగులు భూములు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని పేదలకు ఇంటి స్థలాలతో పాటు ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించాలని కోరారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దన్న, రంగప్ప, గౌతమి, నారాయణ స్వామి, వెంకటేశులు, లక్ష్మీ నారాయణ, నజీర్ తదితులు పాల్గొన్నారు.

కొల్హాపురమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో కొల్హాపురమ్మ

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లి గ్రామంలో వెలసిన కొల్హాపురమ్మ మహాలక్ష్మీదేవి అమ్మవారి ఆలయ ఐదో వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆంజనేయస్వామి, మధ్యాహ్నం కొల్హాపురమ్మకు జ్యోతుల ఉత్సవం, రాత్రికి అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే బుధవారం ఉదయం జ్యోతులు, అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయండి



వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగా 2018లో జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారని జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉదయం 7 గంటలకే కళాశాలకు రావాల్సిన పరిస్థితి ఉందని, వారికి మధ్యాహ్న భోజనం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన



సజ్జల విత్తన ప్యాకెట్‌ను రైతుకు అందిస్తున్న ఏఓ వీరనరేష్

గుడిబండ: మండల కేంద్రంలోని ఎఫ్‌పీఓ కార్యాలయంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ సాగు, వాతావరణ పరిస్థితులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు సుస్థిరమైన పద్ధతిలో వ్యవసాయ సాగు వనరులను ఉపయోగించుకుంటూ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మెరుగుపర్చుకోవాలన్నారు. వ్యవసాయ రైతు సంఘాలను సక్రమంగా నిర్వహించుకోలని సూచించారు. అనంతరం రైతులకు విత్తనాలను అందించారు. కార్యక్రమంలో ఏపీమాస్ డైరెక్టర్ గోపాల్‌రాజ్, ఎఫ్‌పీఓ సీసీ దేవరాజు, ఎఫ్‌పీఓ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా ద్వారా నీళ్లివ్వాలి



చిలమత్తూరు మండలం మీదుగా హంద్రీనీవా కాలువ వెళుతున్నా మండలంలోని చెరువులకు నీరందని పరిస్థితి ఉంది. గతంలో ఎమ్మెల్యే బాలకృష్ణ హంద్రీనీవా ద్వారా మండలంలోని చెరువులకు నీరిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చేలా అసెంబ్లీలో చర్చించాలి. అలాగే గ్రామీణ రోడ్లు వేయించి ఇబ్బందులు తొలగించాలి.

– శంకర్‌రెడ్డి, మరవకొత్తపల్లి, చిలమత్తూరు

జిల్లాకు పరిశ్రమలు తీసుకురావాలి



కియా పరిశ్రమ రాకతో సమీపంలోని రెండు, మూడు పంచాయతీలు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొందరు నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు అందరికీ ఉపాధి దొరుకుతుంది. కియా పరిసర ప్రాంతంలో అండర్ డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

– రామచంద్ర, గుట్టూరు, పెనుకొండ మండలం

రైతులకు న్యాయం చేయాలి



నియోజకవర్గంలోని రైతులకు న్యాయం చేసే విధంగా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై ఉంది. ముఖ్యంగా పంటకు పెట్టుబడి సాయంతో పాటు పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వం పూర్తిగా భరించేలా చూడాలి. 90 శాతం పూర్తయిన హంద్రీనీవా కాలువను పూర్తి చేసి మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సాగు నీరందించాలి.

– మంజునాథ, రైతు, దేవగానపల్లి, అమరాపురం మండలం

20 పడకల ఆస్పత్రి పూర్తి చేయాలి



మండల కేంద్రంలో 20 పడకల ఆస్పత్రి పనులు పూర్తయ్యేలా మంత్రి సవిత చొరవ తీసుకోవాలి. ఇక్కడే ఆస్పత్రిలో డాక్టర్ ఉండే విధంగా చర్యలు చేపట్టాలి. అసెంబ్లీ సమావేశాల్లో సమస్యను చర్చకు తీసుకురావాలి. అలాగే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఇక్కడే జరిగే విధంగా కృషి చేయాలి.

– ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి , రొద్దం

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



నియోజకవర్గం కేంద్రంలో వక్క పంటకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. ఐదు మండలాలు కలిపి ప్రస్తుతం 1400 హెక్టర్లలో వక్కపంట సాగులో ఉంది. ప్రస్తుతం ఏటా ఒక్క పంటను విక్రయించడానికి రైతులు కర్ణాటక రాష్ట్రం భీమసముద్రం, తుమకూరు, శిరా వంటి పట్టణాలకు వెళ్లాల్సి ఉంది. స్థానికంగా వక్క పంటకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం దృష్టి సారించాలి.

– మారేగౌడు, రైతు, హునిసేకుంట, రొళ్ల మండలం

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

- అసెంబ్లీలో ప్రజాగళం వినిపించండి
- ప్రజాప్రతినిధులకు ప్రజల విన్నపాలు
- రైతు, ఉపాధి, సాగు తదితర అంశాలపై దృష్టి సారించాలని వినతి

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా నెరవేర్చాలని హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. అలాగే స్థానికంగా ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలకు కట్టుబడి అభివృద్ధికి కృషి చేయాలి. ప్రజలకు అందుబాటులో ఉండి తాగు, సాగు నీటితో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, ఆ దిశగా అసెంబ్లీలో తమ వాణి వినిపించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షిబృందం



మడకశిర పరిధిలోని హంద్రీనీవా కాలువ

బస్సు సౌకర్యం కల్పించాలి



మాది గుడిబండ మండలంలోని మారుమూల గుడ్డదహళ్లి తండా. ఇంత వరకూ దేవరహట్టి, గుడ్డదహళ్లి, తండా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. మా గ్రామంలో చాలా మంది కూరగాయలు, పాలను గుడిబండ, మడకశిరకు అనునిత్యం తరలించడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల చదువులకు చాలా ఇబ్బంది పడుతున్నాము. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలి.

– వసీనాయక్, గుడ్డదహళ్లి తండా, గుడిబండ

ఎస్సీ కాలనీలను అభివృద్ధి చేయాలి



గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీలు చాలా అధ్వాన స్థితిలోకి చేరాయి. కనీస మౌలిక సదుపాయాలు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిగా ఎస్సీ, ఎస్టీ కాలనీలకు మాత్రమే కేటాయించి అభివృద్ధి చేయాలి. మా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, రక్షిత మంచినీటి కొళాయిలు, కమ్యూనిటీ భవనం, పైప్‌లైన్ సౌకర్యం ఇతరాత్ర సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలి.

– హనుమంతరాయప్ప, టీడీ పల్లి, రొళ్ల మండలం

రైల్వేరోడ్డును పూర్తిచేయాలి



ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రైల్వే రోడ్డు నిర్మాణ పనులను నూతన ప్రభుత్వం వెంటనే స్పందించి అవసరమైన నిధులు కేటాయించాలి. అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ దీనిపై ప్రస్తావించాలి. రైల్వే రోడ్డు వేయిస్తామని రెండేళ్లగా హడావుడి చేశారు. దుకాణ దారులు ఇబ్బందులు పడుతూ రోడ్డు నిర్మాణం కోసం దుకాణాలు వెనక్కు జరిపారు. అయినా ఇంతవరకూ చేయలేదు. ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లి అసెంబ్లీలో ప్రస్తవించి అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేసేలా కృషిచేయాలి.

– మల్లికార్జున, హిందూపురం

ఉపాధి అవకాశాలను పెంచాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగ ఉపాధి అవకాశాలను జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. కొత్తగా కొలువు తీరిన కూటమి ప్రభుత్వంపై నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా ఉపాధి రంగంపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించాలి. అంతేకాకుండా రైతులకు మేలు చేసే ప్రతి అంశాన్ని గుర్తించి, రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి. రైతులకు, యువతకు పెద్ద పీట వేసినప్పుడే రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుంది.

– కిరణ్, శ్రీరంగరాజుపల్లి, పరిగి మండలం

రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు, సీసీ రోడ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దృష్టిసారించాలి. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. స్థానికంగానే కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలి. మడకశిర పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

– నగేష్, మడకశిర

రైల్వే బ్రిడ్జిని వెంటనే పూర్తిచేయాలి



పెనుకొండ రైల్వే బ్రిడ్జి త్వరితగతిన పూర్తయ్యేలా మంత్రి సవిత కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఆలస్యంగా సాగుతోంది. దీంతో స్థానికులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైళ్ల సంఖ్య పెరగడంతో రైల్వేగేట్లు తరచూ పడుతుండటంతో అవస్థ పడుతున్నాం.

– సత్యనారాయణ, మునిమడుగు, పెనుకొండ మండలం

పురాన్ని జిల్లా కేంద్రం చేయాలి



హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించేలా ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపాలి. జిల్లాగా ఏర్పడితే పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. మెడికల్ కాలేజీ, యూనివర్సిటీల స్థాపన వలన విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి అన్ని విధాలా ఎమ్మెల్యే కృషి చేయాలి.

– నాగజ్యోతి, హిందూపురం

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. రాజరికపు పరిపాలన నేపథ్యం ఉన్న పెనుకొండలో ఎన్నో కట్టడాలు ఉన్నాయి. అనేకం శిథిలావస్థకు చేరాయి. వాటిని కేంద్ర, రాష్ట్ర నిధులతో అభివృద్ధి పరచి, కొండపై ఇస్కాన్ టెంపుల్ నిర్మిస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి సాధిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడికి క్యూకడతారు.

– అజయ్‌నాయక్, పెనుకొండ

హామీలన్నీ నెరవేర్చాలి



రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలి. ప్రధానంగా పరిగి మండలంలో తాగు,సాగు నీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి. అంతే కాకుండా సంక్షేమ పథకాలను మరింతగా విస్తరించి, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి, కక్షలకు తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.

– డీవీ రమణ, పైడేటి, పరిగి మండలం

చెరువులను కృష్ణా జలాలతో నింపాలి



మడకశిర నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం. ఈ ప్రాంతంలో సాగునీటి సౌకర్యం లేదు. హంద్రీనీవా సాగు నీటి పథకం ద్వారా అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపి రైతులను ఆదుకోవాలి. అలాగే పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నా.

– గోవిందరాజు, గుడ్డగుర్కి, రొళ్ల మండలం

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంఈఓ రాఘవయ్య

అమరాపురం: బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ 1 రాఘవయ్య, ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గౌడనకుంట ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు అరికడదాం .. ఆడబిడ్డలను కాపాడుకుందాం అనే కార్యక్రమాన్ని మహిళా విభాగం ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాఘవయ్య, ఆర్డీ మల్లికార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ మాట్లాడుతూ సమాజంలో బాలికలపై వివక్షత తీవ్రరూపం దాల్చిందన్నారు. బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు అధికమవుతున్నాయన్నారు. వారికి ఉన్న హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు ఆర్డీటీ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలికలు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా మానసిక, శారీరక ఒత్తిడికి గురికావడంతో పాటు ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఆడబిడ్డలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం.శ్రీనివాస రెడ్డి, ఈఓఆర్డీ నాగముని, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

తురుకవాండ్లపల్లిలో సబ్‌కలెక్టర్ విచారణ



బాధితురాలు పార్వతమ్మను విచారిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

మడకశిరరూరల్: మండల పరిధిలోని తురుకవాండ్లపల్లిలో సోమవారం పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ పర్యటించారు. గ్రామానికి చెందిన పార్వతమ్మ పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తన కుమార్లు ఎవరూ చూసుకోవడం లేదని అర్జీ రూపంలో ఫిర్యాదు చేసింది. ముగ్గురు కుమారులకు ఇచ్చిన భూమి తిరిగి తన పేరు మీదా వెనక్కి ఇవ్వాలని కోరింది. అర్జీని పరిశీలించిన సబ్ కలెక్టర్ అపూర్వభరత్ తురకవాండ్లపల్లికి చేరుకొని పార్వతమ్మ ఇంటి వద్ద సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం ఆమె స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు కుమారుల్లో ఒకరు మృతి చెందగా మిగిలిన ఇద్దరు కుమారులు అందుబాటులో లేకపోవడంతో వారిని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయానికి తీసుకురావాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. మరోసారి విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ బాలాంజినేయులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సువర్ణ రథానికి ఘన స్వాగతం



కలశాలు మోస్తున్న విద్యార్థినులు

పావగడ: కన్నడ జ్యోతి సువర్ణ రథయాత్ర సోమవారం మధ్యాహ్నం పావగడకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని శిరా రోడ్డు దేవలకెరె క్రాస్ వద్దకు రథం చేరుకోగానే మాజీ మంత్రి వెంకటరమణప్ప, తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరాం, కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, పాళేగార్ లోకేశ్ కన్నడ అభిమానులు, విద్యార్థులు పెద్ద ఎత్తున రథోత్సవానికి స్వాగతం పలికారు. విద్యార్థినులు పూర్ణ కుంభ కలశాలను మోశారు. వివిధ జాన పద కళా బృందాలు కళా రూపాలను ప్రదర్శించారు. విద్యార్థులు కన్నడ పతాకంతో కన్నడ నినాదాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. శని మహాత్మ సర్కిల్ వద్దకు రథోత్సవం చేరుకొని స్థానికులు పెద్ద ఎత్తున పూజలు చేశారు.

చట్టం ముందు అందరూ సమానమే



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

పావగడ: 'చట్టం, న్యాయం అందరికీ సమానమే. ఇందులో ఎలాంటి జాతి,మత లింగ ,పార్టీల బేధం లేదు. ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం' అని తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే బయలు రంగ మందిరంలో సోమవారం నిర్వహించిన జేడీఎస్ నాయకుల ఆందోళన నేపథ్యంలో ఆయన అక్కడి చేరుకున్నారు. వారితో మాట్లాడి ధర్నా చేయకుండా చేశారు. ఎస్పీ మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు ఎస్పీకి ఫిర్యాదులందించారు.

వ్యక్తి అదృశ్యం



ముకుంద (ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని ఎంఆర్ గొల్లహట్టికి చెందిన రామన్న కుమారుడు ముకుంద అదృశ్యమైనట్లు ఆయన చిన్నాన్న దేవరాజు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాలమేరకు... ముకుందకు కర్ణాటక రాష్ట్రం శిరా నియోజకవర్గం ఉళిగెరె గ్రామంలో మూడేళ్ల క్రితం జయలక్ష్మీతో వివాహమైందన్నారు. ఎంఆర్ గొల్లహట్టిలో గొర్రెలు పోషించుకుని జీవనం సాగించే వారని తెలిపారు. అయితే ద్విచక్ర వాహనంలో 14 రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. అన్ని చోట్లా గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

కాజ్‌వే పనుల అడ్డగింత

రొద్దం: మండల కేంద్రం నుంచి బూచెర్లకు వెళ్లే పెన్నానదిపై నిర్మిస్తున్న కాజ్‌వే బిడ్జి పనులను సోమవారం రైతులు అడ్డుకున్నారు. కాజ్‌వే ఎత్తు పెంచాలని డిమాండ్ చేశారు. ఎత్తు పెంచకపోతే పెన్నానది ప్రవహించినప్పుడు రోడ్డు, తమ వ్యవసాయ పొలాలపై కోతలు వస్తాయన్నారు. అధికారులు స్పందించి ఎత్తు పెంచాలని సంబంధిత పంచాయతీరాజ్ అధికారులను కోరారు.

వేప చెట్టు నుంచి కల్లు



వేపచెట్టు నుంచి ధారగా వస్తున్న కల్లు

పరిగి: మండలంలోని గొవనహళ్లిలో వేప చెట్టు నుంచి కల్లు కారుతోంది. గురుపౌర్ణమి అయిన ఆదివారం సాయంత్రం నుంచి వేప చెట్టుకు కల్లు (పాల లాంటి ద్రవం) వస్తోంది. స్థానికులు సోమవారం ఉదయం గుర్తించారు. స్థానికులు పెద్ద ఎత్తున వేపచెట్టు వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇదంతా దైవ మహత్యమేనని స్థానికులు చెబుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో కత్తెర పురుగు నివారణ

లేపాక్షి: మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించవచ్చని ఏరువాక వ్యవసాయ కేంద్రం కోఆర్డినేటర్ డా. జాన్సన్, డా.రామసుబ్బయ్య తెలిపారు. సోమవారం వారు మండలంలోని కంచి సముద్రం గ్రామంలో మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓ పుష్పలత, రైతు సేవా కేంద్రం సిబ్బంది పార్థసారథి, రఘు, హరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా

హిందూపురం: మున్సిపల్ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నా చేపట్టారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. చనిపోయిన వర్కర్ల స్థానంలో ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తూ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. 60 ఏళ్లు దాటిన ఉద్యోగం నుంచి తొలగించిన వారి స్థానంలో ఆ కుటుంబంలోనే ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. పనిభారాన్ని తగ్గిస్తూ కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బాబు, మారుతీరెడ్డి, జబీవుల్లా, ఇస్మాయిల్, ముత్యాలప్ప, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు



భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి , జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో శాశ్వత హుండీలను మంగళవారం లెక్కిస్తున్నట్లు ఈఓ నరసింహరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆంజనేయస్వామి తర్వాత లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన మొత్తాన్ని భక్తులు, గ్రామాల ప్రజల సమక్షంలో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

కేంద్రం నిధులతో పాఠశాల అభివృద్ధి



విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: మండల పరిధిలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల పీఎం శ్రీ కింద ఎంపికై నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఆ పాఠశాలను ఆయన సందర్శించారు. తొలుత రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు.